సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
సోమవారం । 7 । ఏప్రిల్ । 2025



ఉత్సాహంగా.. ఉల్లాసంగా

శ్రీరామనవమి సందర్భంగా గార్లదిన్నె మండలం కల్లూరులో గ్రామీణ క్రీడా పోటీలు ఉత్సాహంగా ఉల్లాసంగా జరిగాయి.



సాంకేతిక విద్య.. ఉజ్వల భవిత

డిప్లొమా కోర్సులకు భారీ డిమాండ్ ఏర్పడింది. ఈ కోర్సుల్లో చేరేందుకు పదో తరగతి పాసైన విద్యార్థులు పాలిసెట్ రాయాల్సి ఉంటుంది.

8లో

గరిష్టం/కనిష్టం
38.1°/23.3°

జిల్లా అంతటా ఆదివారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. వేసవితాపం కొనసాగింది. ఆగ్నేయం దిశగా గంటకు 8 నుంచి 10 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

పండుగకు నోచని ఉపాధ్యాయులు



స్పాట్ వాల్యుయేషన్‌లో నిమగ్నమైన ఉపాధ్యాయులు

పుట్టపర్తి: శ్రీరామ నవమిని పురస్కరించుకుని ఆదివారం పిల్లాపాపలతో కుటుంబ సమేతంగా రామాలయాలు దర్శించుకుని పండుగ చేసుకున్నారు. అయితే ఉపాధ్యాయులకు ఆ అవకాశం లేకుండా పోయింది. కొత్తచెరువులోని బాల, బాలికల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం పదో తరగతి పరీక్షల స్పాట్ వాల్యుయేషన్‌కు దాదాపు 800 మంది ఉపాధ్యాయులు హాజరయ్యారు. పండుగకు కూడా సెలవు ఇవ్వకుండా స్పాట్ వాల్యుయేషన్ విధులు అప్పగించడంపై టీచర్లు అసంతృప్తి వ్యక్తం చేశారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

ప్రశాంతి నిలయం: కలెక్టర్ కార్యాలయంలోని పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు కలెక్టర్ చేతన్ తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు.

నేడు పోలీస్ కార్యాలయంలో...

పుట్టపర్తి టౌన్: జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు ఎస్పీ రత్న తెలిపారు. ప్రజలు తమ సమస్యలపై నేరుగా అర్జీలు సమర్పించవచ్చని పేర్కొన్నారు.

క్రీడలతో అంతర్జాతీయ స్థాయి గుర్తింపు



మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్

ధర్మవరం: చదువుతోపాటు క్రీడల్లో రాణిస్తే అంతర్జాతీయ స్థాయి గుర్తింపు లభిస్తుందని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ తెలిపారు. ధర్మవరం ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఆదివారం ఊకా అశ్వత్థనారాయణ మెమోరియల్ 15వ హాకీ ఆంధ్రప్రదేశ్ జూనియర్ మెన్ ఇంటర్ డిస్ట్రిక్ హాకీ చాంపియన్‌షిప్ పోటీలను మంత్రి ప్రారంభించారు. నాలుగు రోజులపాటు సాగే రాష్ట్రస్థాయి హాకీ పోటీల్లో పాల్గొనేందుకు వివిధ జిల్లాల నుంచి 22 జట్లకు చెందిన 440 మంది క్రీడాకారులు వచ్చారు. క్రీడాకారులను పరిచయం చేసుకున్న అనంతరం మంత్రి మాట్లాడుతూ ధర్మవరంలో టర్ఫ్ హాకీ కోర్టు నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

తొలిరోజు విజేతలు..

చిత్తూరుతో జరిగిన హాకీ మ్యాచ్‌లో 10 గోల్స్‌తో కాకినాడ విజయం సాధించింది. ఇక నంద్యాల జట్టుతో జరిగిన మ్యాచ్‌లో ప్రకాశం జట్టు ఐదు గోల్స్‌తో గెలుపొందింది. ఇక విశాఖపట్నంతో జరిగిన మ్యాచ్‌లో శ్రీకాకుళం జట్టు 3.2 గోల్స్‌తో విజయం సాధించింది. మన్యం జట్టుపై అన్నమయ్య జట్టు 5 గోల్స్‌తో గెలుపొందింది. నెల్లూరు జట్టుపై 5 గోల్స్‌తో తిరుపతి జట్టు విజేతగా నిలిచింది. వెస్ట్ గోదావరి జట్టుతో జరిగిన మ్యాచ్‌లో 2 గోల్స్‌తో అనకాపల్లి జట్టు విజయం సాధించింది. కర్నూలు జట్టుతో జరిగిన మ్యాచ్‌లో 12 గోల్స్‌తో కడప విజేతగా నిలిచింది. కార్యక్రమంలో హాకీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు చాణక్యరాజు, ఉపాధ్యక్షుడు సూర్యప్రకాష్, కార్యదర్శి హర్షవర్ధన్, కోశాధికారి థామస్, సౌత్ రైల్వే ఆఫీసర్ కత్తి గీతారెడ్డి, ఆర్డీఓ మహే ష్, మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్, జనసేన పార్టీ ఇన్‌చార్జ్ చిలకం మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య



మృతురాలు అర్చన

కూడేరు: ఇంటర్ విద్యార్థిని బలవన్మరణానికి పాల్పడింది. పోలీసులు తెలిపిన మేరకు... జయపురానికి చెందిన మదన్‌మోహన్, సునీత దంపతులకు కుమార్తె అర్చన (16), ఓ కుమారుడు ఉన్నారు. అనంతపురంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్న అర్చన ఇటీవల మొదటి సంవత్సరం పరీక్షలు రాసి ఇంటికి చేరుకుంది. పరీక్షలు సక్రమంగా రాయలేకపోయానని, ఫెయిల్ అవుతానంటూ తల్లిదండ్రులతో చెప్పుకుని బాధపడేది. ఈ క్రమంలోనే తీవ్ర మానసిక సంఘర్షణకు లోనైన అర్చన... ఆదివారం వేకువజామున ఇంట్లోనే బాత్రూమ్‌లో ఉరి వేసుకుంది. పోలీసులు కేసు నమోదు చేశారు.

- రామగిరి, ధర్మవరంలో ఇష్టారాజ్యంగా అమ్మకాలు
- 'తమ్ముళ్ల' కోసం సంపద సృష్టిస్తోన్న యువ నాయకుడు
- అధికారులు కన్నెత్తి చూడకూడదంటూ ఒత్తిళ్లు చేస్తున్న వైనం
- బెల్టు దందాలో తేడా వచ్చి ఆత్మహత్య చేసుకున్న ఓ వివాహిత
- ఆలయాల వద్ద బెల్టు షాపు ఉన్నా పట్టించుకోని ఎక్సైజ్ అధికారులు
- మత్తులో దేవాలయాల్లోకి చొరబడి.. భయపెడుతోన్న మందుబాబులు

యువనేత అండ.. బెల్టు దందా



ధర్మవరంలో నిబంధనలకు విరుద్ధంగా జనావాసాల మధ్య ఏర్పాటు చేసిన మద్యం దుకాణం



ఇక్కడ కనిపిస్తున్న అనధికారిక మద్యం దుకాణం రామగిరి మండలం నసనకోట ముత్యాలమ్మ ఆలయం వద్ద వెలసింది. ప్రతి ఆది, మంగళ, శుక్రవారాల్లో ముత్యాలమ్మ ఆలయం వద్ద భక్తులతో జాతరను తలపిస్తుంది. డిమాండ్ ఆధారంగా ఓ వ్యక్తి ఆలయ సమీపంలోనే బెల్టు షాపు నిర్వహిస్తున్నాడు. క్వార్టర్‌పై అదనంగా రూ.40, బీరు బాటిల్‌పై అయితే రూ.80 వరకు వసూలు చేస్తున్నాడు. మద్యం దుకాణం, బార్ తరహాలో ఫ్రిజ్ ఏర్పాటు చేసి ఫోన్‌పే స్కానర్ ద్వారా అమ్మకాలు సాగిస్తున్నాడు.



ఈ రూము బార్ కాదు.. పర్మిట్ రూము అంతకన్నా కాదు. ధర్మవరం పట్టణంలోని పట్టుగూళ్ల మార్కెట్ ఎదురుగా ఉన్న మద్యం దుకాణంపైన ఏర్పాటు చేసిన అనధికారిక రూము. అక్కడే మద్యం కొనుగోలు చేసి మేడపైకి వెళ్లి సేవిస్తారు. మందుబాబులకు అనుకూలంగా అక్కడే స్నాక్స్ కూడా అందుబాటులో ఉంచారు. గ్లాసులు, వాటర్ బాటిళ్లు, కూల్ డ్రింక్స్ తదితర తిండి పదార్థాలన్నీ అక్కడే విక్రయిస్తున్నారు. ప్రధాన రహదారి కావడంతో మందుబాబుల ఆగడాలతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది.

సాక్షి, పుట్టపర్తి: కొత్త ఎక్సైజ్ పాలసీ అందుబాటులోకి వచ్చిన తర్వాత కూటమి పార్టీల నాయకులు అక్రమార్జనే ధ్యేయంగా బెల్టు దందా సాగిస్తున్నారు. అధికారాన్ని అడ్డు పెట్టుకుని 'బెల్టు' వ్యాపారాన్ని మూడు పూవులు.. ఆరు కాయలుగా కొనసాగిస్తున్నారు. పర్యవేక్షించాల్సిన అధికారులు రాజకీయ ఒత్తిళ్లకు లొంగడంతో అనధికారిక రూములు, బెల్టు షాపులకు అడ్డూ అదుపు లేకుండాపోయింది. చెన్నేకొత్తపల్లి, ధర్మవరం ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో ఇష్టారాజ్యంగా వెలిశాయి. కూటమి పార్టీలకు చెందిన ఓ యువనేత అండదండలతో రెండు నియోజకవర్గాల్లో బెల్టు దందా జోరుగా సాగుతోందనే ఆరోపణలు ఉన్నాయి. తన కార్యకర్తలకు సంపద సృష్టించాలనే క్రమంలో ఆ యువనేతనే 'బెల్టు' మార్గం సూచించినట్లు సమాచారం. ఆ నేత అండదండలతో అనుమతులు ఒక చోట తీసుకుని.. మరో చోట దుకాణం నిర్వహిస్తున్నా.. అధికారులు ఏమీ చేయలేని స్థితిలో ఉన్నారు.

నిబంధనలకు పాతర

మద్యం దుకాణాల విషయంలో 'తెలుగు తమ్ముళ్లు' ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ధర్మవరం రూరల్‌లో అనుమతులు తీసుకుని.. అర్బన్‌లో షాపు నిర్వహిస్తున్నారు. వ్యాపారమే ధ్యేయంగా జనావాస ప్రాంతాల్లోనే మద్యం దుకాణం ఏర్పాటు చేశారు. ఎవరైనా అడిగితే యువనేత అండ ఉందని.. ఎవరూ ఏమీ చేయలేరని నిర్వాహకులు సమాధానం చెబుతున్నారు. పట్టుగూళ్ల మార్కెట్‌కు ఎదురుగా ఉన్న మద్యం దుకాణంపైన అనధికారికంగా రూము ఏర్పాటు చేశారు.

ప్రాణం తీసిన 'బెల్టు' దందా

ధర్మవరం నియోజకవర్గంలో కూటమి నేతల స్వార్థానికి అమాయకురాలు బలైంది. ఫలితంగా ఇద్దరు చిన్నారులు అనాథలుగా మారారు. ధర్మవరం మండలం దర్శనమల గ్రామంలో రెండు బెల్టు షాపులను టీడీపీ నేతలు నిర్వహిస్తున్నారు. మిగతా ఎవరూ మద్యం దుకాణాలు నిర్వహించరాదని హుకుం జారీ చేశారు. ఒంటరి మహిళ అంకె కుమారి.. తన ఇద్దరు కుమారుల పోషణ కోసం గత్యంతరం లేక మద్యం అమ్మేది. ఓర్వలేని సదరు టీడీపీ కార్యకర్తలు కొన్నిరోజుల క్రితం మద్యం అమ్మకూడదంటూ చితకబాదారు. అవమానం భరించలేని ఆ మహిళ ఆత్మహత్య చేసుకుంది.

మత్తులో హుండీ చోరీ

యువనేత అండతో రామగిరి, ధర్మవరంలో బెల్టు షాపులు ఇష్టారాజ్యంగా నిర్వహిస్తున్నారు. బెల్టు షాపుల నిర్వాకంతో అనేక గొడవలు, అఘాయిత్యాలు వెలుగు చూస్తున్నాయి. నసనకోట ముత్యాలమ్మ ఆలయం వద్ద బెల్టు షాపు కారణంగా మద్యం మత్తులో కొందరు ఆకతాయిలు అమ్మవారి హుండీ చోరీ చేశారు. అక్కడే మద్యం దుకాణం ఉండటంతో తప్పతాగి మత్తులో ఆలయంలోకి చొరబడి భక్తులకు కూడా పలు రకాలుగా ఇబ్బంది కలిగిస్తున్నట్లు పలువురు అభిప్రాయపడుతున్నారు.



ధర్మవరంలో మద్యం దుకాణం పైన ఏర్పాటు చేసిన తినుబండారాలు

కేసులు నమోదు చేస్తాం



బెల్టు షాపులు నిర్వహిస్తే చర్యలు తప్పవు. ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తున్నాం. అనుమతులు పొందిన మద్యం దుకాణాల్లో మాత్రమే అమ్మకాలు జరగాలి. ఏ దుకాణానికీ ఇప్పటి వరకు పర్మిట్ రూములు ఇవ్వలేదు. త్వరలోనే స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తాం. ఎక్కడికక్కడ కేసులు నమోదు చేసి జరిమానా విధిస్తాం. విధుల విషయంలో రాజకీయ ఒత్తిళ్లకు లొంగే ప్రసక్తే లేదు.

– గోవిందనాయక్, ఎక్సైజ్ సూపరింటెండెంట్, పుట్టపర్తి

రేపు మాజీ సీఎం జగన్ పర్యటన

- పాపిరెడ్డిపల్లిలో కురుబ లింగమయ్య కుటుంబానికి పరామర్శ



రామగిరి: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం నాటి జిల్లా పర్యటన ఖరారైంది. రామగిరి మండలం పాపిరెడ్డిపల్లిలో ఎమ్మెల్యే పరిటాల సునీత బంధువులైన టీడీపీ నాయకుల చేతిలో దారుణహత్యకు గురైన కురుబ లింగమయ్య కుటుంబాన్ని పరామర్శించేందుకు ఆయన రానున్నారు. పర్యటన షెడ్యూల్‌ను వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం ఆదివారం మీడియాకు విడుదల చేసింది. మంగళవారం ఉదయం 9.30 గంటలకు బెంగళూరులోని నివాసం నుంచి రోడ్డు మార్గాన హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి హెలికాప్టర్‌లో బయల్దేరి 10.40 గంటలకు చెన్నేకొత్తపల్లి వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు వస్తారు. అక్కడి నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులతో కలసి 10.50 గంటలకు రోడ్డు మార్గాన ఎన్ఎస్ గేట్ మీదుగా బయల్దేరి 11.05 గంటలకు పాపిరెడ్డిపల్లికి చేరుకుంటారు. 12.05 గంటల వరకు లింగమయ్య కుటుంబ సభ్యులను పరామర్శించి, ధైర్యం చెప్తారు. అనంతరం అక్కడి నుంచి తిరిగి కాన్వాయ్‌లో చెన్నేకొత్తపల్లి హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. 12.30 గంటలకు హెలికాప్టర్‌లో బెంగళూరుకు బయల్దేరుతారు.

పర్యటన విజయవంతం చేయండి

పెనుకొండ రూరల్ : పార్టీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ పర్యటనను విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ పిలుపునిచ్చారు. టీడీపీ నాయకుల చేతిలో హత్యకు గురైన కురుబ లింగమయ్య కుటుంబాన్ని పరామర్శించేందుకు పాపిరెడ్డిపల్లికి విచ్చేస్తున్నారని పేర్కొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు మంగళవారం ఉదయం 9.30 గంటలకు చెన్నేకొత్తపల్లికి చేరుకోవాలని ఆమె సూచించారు.

ప్రాణాలు తీసిన అతివేగం

- టిప్పర్‌ను ఢీకొన్న టాటాఏస్
- ఇద్దరు దుర్మరణం.. మరొకరికి గాయాలు
- బెంగళూరు సమీపాన నెలమంగళ వద్ద ఘటన




మృతులు త్రివేణి, కుమార్ (ఫైల్)

రొళ్ల: అతివేగం రెండు ప్రాణాలను బలిగొంది. ఓవర్ టేక్ చేసే క్రమంలో టిప్పర్‌ను టాటాఏస్ వాహనం ఢీకొనడంతో ఈ ఘటన జరిగింది. వివరాలిలా ఉన్నాయి. రొళ్ల మండలం బీజీ హళ్లికి చెందిన తిప్పేస్వామి కుమార్తె త్రివేణి (26)కి కర్ణాటక రాష్ట్రం మధుగిరి తాలూకా కాటగానహళ్లి చెందిన సిద్ధగంగతో ఐదేళ్ల క్రితం వివాహమైంది. రెండేళ్ల తర్వాత కుటుంబ కలహాల కారణంగా త్రివేణి పుట్టింటికి వచ్చేసింది. ఇంటి వద్ద ఖాళీగా ఉండలేక బెంగళూరులోని ఓ వస్త్ర దుకాణంలో పనిచేస్తోంది. శ్రీరామ నవమి పండుగ నిమిత్తం త్రివేణి పుట్టింటికి వచ్చింది. వరుసకు మామ అయిన మల్లసముద్రం గ్రామానికి చెందిన బద్రీనాథ్ టాటా ఏస్ వాహనంలో బంధువు, అమరాపురం మండలం పి.శివరం గ్రామానికి చెందిన కుమార్ (35) బెంగళూరులో నివాసం ఉండేందుకు ఆదివారం అవసరమైన సామగ్రి వేసుకుని వెళ్తుండగా.. త్రివేణి కూడా అందులోనే బయల్దేరింది. బెంగళూరు సమీపాన నెలమంగల వద్ద జాతీయ రహదారి–4పై ఓవర్‌టేక్ చేసే క్రమంలో టాటా ఏస్ వాహనం అదుపుతప్పి టిప్పర్ లారీని ఢీకొని బోల్తా పడింది. ఈ ఘటనలో త్రివేణి, కుమార్ ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. బద్రీనాథ్ స్వల్ప గాయాలతో బయట పడ్డారు. కుమార్‌కు భార్య శివమ్మ, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

సమ్మెలో 'శ్రీరామరెడ్డి' కార్మికులు

కళ్యాణదుర్గం రూరల్: బకాయి వేతనాలు, పీఎఫ్‌తో పాటు కార్మికుల సమస్యలు పరిష్కరించాలంటూ సీఐటీయూ ఆధ్వర్యంలో శ్రీరామరెడ్డి తాగునీటి సరఫరా పథకం కార్మికులు శనివారం అర్ధరాత్రి నుంచి సమ్మెలోకి వెళ్లారు. దీంతో నీటి సరఫరా నిలిచిపోయింది. ఆదివారం ఉదయం కళ్యాణదుర్గంలోని శ్రీరామరెడ్డి తాగునీటి పథకం పంప్ హౌస్ వద్ద చేపట్టిన నిరసన కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు, జిల్లా అధ్యక్షురాలు నాగమణి, ఉపాధ్యక్షుడు రామాంజి, సహాయ కార్యదర్శి అచ్యుత్‌ప్రసాద్ మాట్లాడారు. శ్రీరామరెడ్డి నీటి సరఫరా కార్మికులపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. కూటమి నాయకుల మాటలు నమ్మి గతంలో కార్మికులు చేపట్టిన సమ్మెను విరమించారని, నాడు ఇచ్చిన హామీ మేరకు నేటికీ సమస్యలు పరిష్కరించలేదని మండిపడ్డారు.

సీతారాముల కల్యాణ వైభోగమే..

ప్రశాంతి నిలయం: సీతారాముల కల్యాణం భక్తజనం కనులారా తిలకించి తరించింది. శ్రీరామనవమి సందర్భంగా ఆదివారం ఉదయం ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంత్ సభా మందిరంలో సత్యసాయి మహాసమాధి చెంత వేడుకలు నిర్వహించారు. తెలంగాణ సత్యసాయి భక్తులు యజుర్ మందిరం నుంచి సీతారామ లక్ష్మణ సమేత హనుంతుల చిత్రపటాలతో పాటు కల్యాణోత్సవానికి సంబంధించిన తలంబ్రాలు, తీపివస్తువులు, నూతన వస్త్రాలను ర్యాలీగా తీసుకువచ్చారు. తర్వాత వేదపండితులు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదిక వద్ద సీతారాముల కల్యాణోత్సవం నిర్వహించారు. చక్కటి భక్తిగీతాలతో సీతారామ లక్ష్మణ సమేత హనుంతులను, సత్యసాయిని కీర్తించారు. సాయంత్రం మృదురవళి దర్బా బృందం నిర్వహించిన సంగీత కచేరీ భక్తులను మైమరిపించింది.



ప్రశాంతి నిలయంలో సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం



వేడుకల్లో పాల్గొన్న భక్తులు



సంగీత కచేరీ నిర్వహిస్తున్న మృదురవళి దర్బా బృందం



నల్లమాడ మండలం నల్లశింగయ్యగారిపల్లిలో నిర్వహించిన సీతారాముల కల్యాణోత్సవంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి దంపతులు



హిందూపురం ముద్దిరెడ్డిపల్లి పాండురంగస్వామి ఆలయంలో రాములోరి కల్యాణోత్సవం



బత్తలపల్లి మండలం పోట్లమర్రిలో ఉట్టి కొట్టేందుకు పోటీపడుతున్న యువకులు

అంతా రామమయం

- జిల్లా అంతటా శ్రీరామ నవమి శోభ

పుట్టపర్తి టౌన్: శ్రీరామనవమి వేడుకలు జిల్లా అంతటా వైభవంగా జరిగాయి. ఆదివారం తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయాలకు క్యూ కట్టారు. జగదభిరాముడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. శ్రీరామ నామస్మరణతో జిల్లా కేంద్రం పుట్టపర్తి పులకించింది. మున్సిపాలిటీలోని బీడుపల్లిలో అభయాంజనేయ స్వామి ఆలయం, రామాలయం, ఎనుములపల్లి, బ్రాహ్మణపల్లి, ప్రశాంతి గ్రామంలోని అయోధ్య రామాలయాల్లో సీతారాముల కల్యాణం రమణీయంగా సాగింది. ఆలయ ఆవరణలో సీతారామలక్ష్మణ ఆంజనేయ విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు. పానకాలు, వడపప్పు, తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలో హనుమాన్ దేవాలయం, గోవిందయ్యపేట, కాలనీల్లో వైభవంగా సీతారాముల కల్యాణం నిర్వహించారు. సాయంత్రం గ్రామాల్లో సీతారామ లక్ష్మణ విగ్రహాలను, చిత్రపటాలను డప్పు వాయిద్యాల మధ్య ఊరేగించారు. భక్తులు కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. పుట్టపర్తి మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి తన స్వగ్రామం నల్లమాడ మండలం నల్లశింగయ్యగారిపల్లిలో జరిగిన శ్రీరామ నవమి వేడుకల్లో పాల్గొన్నారు. అలాగే అన్ని మండల కేంద్రాలు, పట్టణ ప్రాంతాలు, గ్రామాల్లో శ్రీరామ నవమి వేడుకలు అంబరాన్నంటాయి. రాములోరి కల్యాణం కనులారా చూసి తరించారు. అంతేకాదు రంగులు చల్లుకుంటూ.. పానకాలు పంచుతూ.. ఉట్ల పరుషలో యువకులు ఉత్సాహంగా పోటీ పడుతూ సందడిగా గడిపారు.

క్లుప్తంగా

ఎఫ్‌వీఎఫ్ - బీపీఎల్ క్రికెట్ టోర్నీ ప్రారంభం



క్రీడాకారులనుద్దేశించి మాట్లాడుతున్న ముఖ్యఅతిథులు

బత్తలపల్లి: ఏడీసీపీ ఆధ్వర్యంలో బత్తలపల్లిలోని ఆర్డీటీ క్రీడా మైదానం వేదికగా ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్, బీపీఎల్ సీజన్-3 క్రికెట్ టోర్నీ ఆదివారం ప్రారంభమైంది. ఆర్డీటీ ఆర్డీ ప్రమీల, ఏపీ రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ గోనుగుంట్ల విజయ్‌కుమార్, సీఐలు నాగేంద్ర, ప్రభాకర్ ముఖ్యఅతిథులుగా హాజరై పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విభేదాలకు తావివ్వకుండా క్రీడాస్ఫూర్తిని చాటాలని క్రీడాకారులకు పిలుపునిచ్చారు. ఈ పోటీలు ఈ నెల 13వ తేదీ వరకు జరుగుతాయన్నారు. అనంతరం టీమ్ అన్నీ, టీమ్ మాంఛో, టీమ్ విష, టీమ్ విన్సెంట్, ఎంవీఎం, ఆర్డీటీ జట్ల క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో క్రికెట్ కోచ్ జయరాం తదితరులు పాల్గొన్నారు.

హిటాచీకి నిప్పు



కాలిపోయిన హిటాచీ వాహనం

ధర్మవరం రూరల్: మండలంలోని ఓబుళనాయనపల్లి సమీపంలోని గుట్టలో మట్టి తవ్వకాలు కొనసాగిస్తున్న హిటాచీన వాహనానికి శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. పోలీసులు తెలిపిన మేరకు... ఓబుళనాయనపల్లి వద్ద ఉన్న గుట్టలోని మట్టిని టిప్పర్లకు వేసేందుకు ధర్మవరం పట్టణానికి చెందిన కిషోర్ వద్ద ఉన్న హిటాచీ వాహనాన్ని శివ లీజుకు తీసుకున్నాడు. శనివారం రాత్రి హిటాచీని అక్కడే ఉంచి డ్రైవర్, హెల్పర్లు ఇంటికి వెళ్లిపోయారు. ఎవరూ లేని విషయాన్ని గుర్తించిన దుండగులు వాహనంపై పెట్రోల్ పోసి నిప్పు పెట్టారు. దీంతో పూర్తిగా కాలిపోయింది. ఆదివారం ఉదయం అక్కడికెళ్లిన డ్రైవర్ విషయాన్ని గుర్తించి సమాచారం ఇవ్వడంతో ధర్మవరం రూరల్ పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. కాగా, మట్టి తవ్వకాల్లో తలెత్తిన విభేదాల కారణంగా నిప్పు పెట్టి ఉండ వచ్చునని స్థానికులు అనుమానిస్తున్నారు.

సంతల ఆదాయం రూ.3.66 లక్షలు

అనంతపురం అగ్రికల్చర్: స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డు ప్రాంగణంలో ఈవారం జరిగిన పశువులు, జీవాల సంతల ద్వారా రూ.3.66 లక్షలకు పైగా ఆదాయం వచ్చినట్లు సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ కె.గోవిందు తెలిపారు. అందులో శనివారం జరిగిన గొర్రెలు, మేకలు, పొట్టేళ్ల సంత నుంచి రూ.2,25,090 వసూలు కాగా.. ఆదివారం జరిగిన పశువులు, గేదెలు, ఎద్దుల సంత నుంచి రూ.1,41,350 మేర వసూలైనట్లు పేర్కొన్నారు.

అజరామరం.. రత్నగిరి వైభవం


- నేటికి చెక్కు చెదరని కోటలు, పురాతన కట్టడాలు
- భక్తులపాలిట కొంగు బంగారంగా విరాజిల్లుతున్న కొల్హాపురి మహాలక్ష్మీదేవి
- 13 నుంచి 21వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు



రత్నగిరిలో వెలసిన కొల్హాపురి మహాలక్ష్మీ మూలవిరాట్



రత్నగిరిలోని పురాతన జైన మందిరం



రత్నగిరి కోట

రొళ్ల: మండలంలోని రత్నగిరిలో నాటి రాచరికపు వైభవం నేటికీ చెక్కుచెదరలేదు. నాడు నిర్మించిన కోటలు, చంద్రశాల, అంతఃపురం, గజశాలలు, రాతి ఏనుగులు, బురుజులు, కళ్యాణిబావులు, మంటపాలు, పురాతన కట్టడాలు, ఊరి చుట్టూ కోట, కొండపై ఎత్తైన బురుజులు, రాతి బండపై ఏర్పాటు చేసిన మెట్టికెలు ఇలా ఎన్నో కట్టడాలు నేటికీ అలాగే ఉన్నాయి. గ్రామంలో అక్కడక్కడ కనిపించే జైన దేవాలయాను బట్టి చూస్తే ఈ ప్రాంతంలో జైనమతం వ్యాప్తి చెందినట్లుగా తెలుస్తోంది. ఉమ్మడి అనంతపురం జిల్లాలోనే అత్యంత ప్రసిద్ధి గాంచిన కొల్హాపురి మహాలక్ష్మీదేవి ఈ గ్రామంలోనే వెలసింది. రాజవంశీకులతో పాటు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాలకు చెందిన వారు, సమీపంలోని కర్ణాటక వాసులు తమ ఇలవేల్పుగా అమ్మవారిని కొలుస్తుంటారు.

ఆరు శతాబ్దాల నాటి ఆలయం

రత్నగిరిలో వెలసిన కొల్హాపురి మహాలక్ష్మి ఆలయానికి దాదాపు 628 ఏళ్ల నాటి చరిత్ర ఉన్నట్లు పూర్వీకులు చెబుతున్నారు. వారు చెబుతున్న కథనం మేరకు.. 'పూర్వం చోళ రాజుల వంశానికి చెందిన రత్నగిరి సంస్థాన మహారాజైన కృష్ణప్పరాజు... సురుపూర్‌కు చెందిన రాణి గౌడమ్మను వివాహం చేసుకున్నాడు. అప్పట్లో రాణి గౌడమ్మను రత్నగిరి సంస్థానానికి గుర్రపు మార్గాన తీసుకొస్తున్నప్పుడు ఓ రకమైన శబ్దం రావడంతో ప్రశ్నించారు. నేను కొల్హాపురి మహాలక్ష్మీదేవిని మీ సంస్థానంలో కొలువుదీరేందుకు మీ వెంట అరిసిన కుంకుమ రూపంలో వస్తున్నానని అశరీరవాణి చెబుతుంది. రాణి గౌడమ్మ సంస్థానానికి వచ్చిన మరుసటి రోజు అమ్మవారు అరిసిన కుంకుమ (పసుపు కుంకుమ) రూపంలో కొలువుదీరింది. క్రమేణ దానిపై నాగుల పుట్ట పెరుగుతుంది. దీంతో కృష్ణప్పరాజు, రాణిగౌడమ్మ అప్పట్లో గారతో అమ్మవారి (కొల్హాపురి మహాలక్ష్మీదేవి) ప్రతిమను చేయించి ఆలయం నిర్మించారు. అప్పటి నుంచి ఈ ఆలయంలో విశేష పూజలు కొనసాగుతూ వస్తున్నాయి.'

13వ తేదీ నుంచి బ్రహ్మోత్సవాలు

ఈ నెల 13 నుంచి 21వ తేదీ వరకు రత్నగిరిలో కొల్హాపురి మహాలక్ష్మి అమ్మవారి బ్రహ్మోత్సవాలను నిర్వహించనున్నారు. ఈ మేరకు రాజవంశీకుడు రంగప్పరాజు (దొర), ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు తెలిపారు. 13న జలధి ఉత్సవం, కలశ స్థాపనతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. 14న బ్రహ్మరథోత్సవం, ధూళోత్సవం, 15న జలధి, కలశ ఉత్సవం, గంగ పూజ, 16 నుంచి 19వ తేదీ వరకు అమ్మవారికి జ్యోతుల ఉత్సవాలు, 20న అమ్మవారికి పుష్పాలంకారణ, పోతులరాజుల విశేష పూజ, 21న పోతురాజు బండార కార్యక్రమం, తీర్థ ప్రసాద వినియోగం ఉంటుంది. ఉత్సవాల సందర్భంగా పశువుల జాతరను నిర్వహిస్తుంటారు. బ్రహ్మోత్సవాలకు వచ్చి వెళ్లే భక్తుల సౌకర్యార్థం మడకశిర డిపోతో పాటు కర్నాటకలోని మధుగిరి, శిర, పావగడ డిపోల నుంచి ప్రత్యేక బస్సులను నడపనున్నారు.

జగన్‌కు మద్దతుగా నిలుద్దాం

- కురుబ యువత రాష్ట్ర అధ్యక్షుడు బిల్లే మంజునాథ్ పిలుపు

అనంతపురం ఎడ్యుకేషన్: జిల్లాలో కురుబలను రాజకీయంగా ముందుకు తీసుకెళ్లి అన్ని విధాలుగా అండగా నిలిచిన వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కురుబలు మద్దతుగా నిలవాల్సిన తరుణం ఆసన్నమైందని, వైఎస్ జగన్‌కు అండగా నిలవాలని కురుబ యువత రాష్ట్ర అధ్యక్షుడు బిల్లే మంజునాథ్ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. రామగిరి మండలం పాపిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన కురుబ లింగమయ్యను టీడీపీ నాయకులు ఇటీవల హత్య చేశారన్నారు. ఎమ్మెల్యే పరిటాల సునీత కుటుంబం నుంచి తమకు ప్రాణహాని ఉందని హతుడి కుమారుడు మీడియా ముందు బహిర్గతం చేశారని గుర్తు చేశారు. ఆ కుటుంబానికి కురుబలు అందరూ అండగా నిలవాలన్నారు. లింగమయ్య కుటుంబాన్ని పరామర్శించేందుకు ఈ నెల 8న పాపిరెడ్డిపల్లికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రానున్నారని, కురుబలు పెద్ద ఎత్తున తరలిరావాలని విజ్ఞప్తి చేశారు. భవిష్యత్తులో కురుబల మీద ఎలాంటి దాడులు జరగకుండా ఉండాలంటే అందరూ ఐక్యంగా నిలబడాలని కోరారు. రానున్న రోజుల్లో ఏ ఎన్నికలు వచ్చినా కురుబలు వైఎస్సార్‌సీపీకి పూర్తిస్థాయిలో మద్దతు నివ్వాలని పిలుపునిచ్చారు.

సాంకేతిక విద్య.. ఉజ్వల భవిత

- డిప్లొమా కోర్సులతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు
- ఈ నెల 30న పాలీసెట్
- పాలిటెక్నిక్ కళాశాల ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ



అనంతపురం: డిప్లొమా కోర్సులకు డిమాండ్ భారీగా నెలకొంది. ఈ కోర్సుల్లో చేరేందుకు పదో తరగతి పూర్తయిన విద్యార్థులు పాలీసెట్ రాయాల్సి ఉంటుంది. ఇప్పటికే సాంకేతిక విద్యాశాఖ పాలీసెట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. విద్యార్థులకు ఆసక్తి ఉన్న ఏ కోర్సులోనైనా చేరి ఇష్టంగా చదివితే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని నిపుణులు పేర్కొంటున్నారు.

చిరుప్రాయంలోనే ఐదు అంకెల వేతనం..

పూర్తిగా ప్రాక్టికల్ ఓరియంటెడ్ సిలబస్ ఉన్న పాలిటెక్నిక్ కోర్సులు పూర్తి చేసిన వారికి తక్షణ ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దక్కుతున్నాయి. దీంతో 19 సంవత్సరాల్లోపే రూ.20 వేల నుంచి రూ.25 వేల వేతనం అందుకునే అవకాశముంది. తక్కువ ఖర్చుతో సాంకేతిక విద్య పూర్తి చేసే అవకాశం కేవలం డిప్లొమా కోర్సులతోనే సాధ్యమని నిపుణులు పేర్కొంటున్నారు. సింహభాగం కంపెనీలు సైతం ఇంజినీరింగ్ పూర్తి చేసిన వారి కంటే డిప్లొమా పూర్తి చేసిన వారినే ఉద్యోగాల్లోకి తీసుకుంటున్నాయి. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా డిప్లొమా కోర్సుల్లో విద్యార్థులను తీర్చిదిద్దడమే ఇందుకు కారణం. ఇంటర్మీడియట్ తరువాత ఇంజినీరింగ్ కోర్సు చదివితే ఆరు సంవత్సరాల కాల వ్యవధి అనివార్యం. ఇలా కాకుండా కేవలం పదో తరగతి ఉత్తీర్ణత అనంతరం మూడేళ్లలో డిప్లొమా కోర్సు పూర్తి చేస్తే కొలువు దక్కడం ఖాయమని సాంకేతిక నిపుణులు పేర్కొంటున్నారు.

కోర్ బ్రాంచ్‌లే అధికం..

ఇంజినీరింగ్‌లో కోర్ బ్రాంచ్‌ల్లో గణనీయంగా అడ్మిషన్లు పడిపోయి కొత్త బ్రాంచ్‌ల వైపు విద్యార్థులు చూస్తున్నాయి. కానీ డిప్లొమోలో కోర్ బ్రాంచ్‌లకే డిమాండ్ ఎక్కువగా ఉంది. ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, మెకానికల్, సివిల్, ఆటోమొబైల్ ఇంజినీరింగ్, ఆర్కిటెక్చర్ వంటి కోర్ బ్రాంచ్‌లతో పాటు కంప్యూటర్ డిప్లొమా కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ఇందులో ఏ కోర్సు పూర్తి చేసినా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు సులువుగా దక్కుతాయి. ప్రభుత్వ పాలిటెక్నిక్ ఇంజినీరింగ్ కళాశాలల్లో తరచూ ఉద్యోగమేళాలు నిర్వహిస్తున్నారు. ఆయా కంపెనీల ప్రతినిధులు వచ్చి విద్యార్థులను ఎంపిక చేసుకుంటున్నారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లొమో కోర్సు పూర్తి చేయడానికి మూడేళ్లకు కలిపి కేవలం రూ.13 వేలు ఖర్చు అవుతుంది. ఆ తర్వాత ఇంజినీరింగ్ రెండో సంవత్సరంలో (లేటరల్ ఎంట్రీ కింద) నేరుగా చేరవచ్చు. లేదా ఉద్యోగంలో చేరవచ్చు.

పాలీసెట్ ఎంట్రెన్స్ ఇలా..

పాలీసెట్‌ను 120 మార్కులకు నిర్వహిస్తారు. గణితం 50, ఫిజిక్స్ 40, కెమిస్ట్రీ 30 మార్కులకు పరీక్ష ఉంటుంది. పదో తరగతి సిలబస్ ఆధారంగా ఈ ప్రవేశ పరీక్ష ఉంటుంది. ఈ నెల 30న పాలీసెట్ నిర్వహించనున్నారు.

ఘనంగా వేమన ఉత్సవాలు ప్రారంభం



వేమన సమాధిని దర్శించుకుంటున్న భక్తులు



శాస్త్రీయ నృత్యం చేస్తున్న బాలికలు



ఆలయ ప్రాంగణంలో వెలసిన దుకాణాలు

గాండ్లపెంట: మండలంలోని కటారుపల్లిలో వెలసిన విశ్వకవి యోగి వేమన ఆలయంలో ఉత్సవాలు ఆదివారం రాత్రి ఆలయ పీఠాధిపతి నందవేమారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా వేమన సమాధిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. కదిరి లక్ష్మీనరసింహాస్వామి ఆలయ ఈఓ వి.శ్రీనివాసరెడ్డి, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆదివారం అర్ధరాత్రి ఆలయ ప్రధాన ద్వారం ఎదుట ఉడికించిన జొన్నలను భంపోసి పసుపు కుంకుమ కలిపి ఆదిశక్తి పూజలు నిర్వహించారు. అనంతరం జొన్న ధాన్యాన్ని ప్రసాదంగా భక్తులు స్వీకరించారు. ఉత్సవాలకు వచ్చిన భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కాగా, ఉత్సవాల్లో భాగంగా సోమవారం బండ్ల మెరవణి, ఆర్కెస్ట్రా (పాటల కచేరి) ఉంటుంది. మొక్కుబడి ఉన్న భక్తులు ఎడ్ల బండ్లను అలంకరించి ఆలయం ఎదుట ఉంచి ప్రత్యేక పూజలు చేయిస్తారు.

'బలహీన వర్గాలే లక్ష్యంగా కూటమి దాడులు'

బత్తలపల్లి: రాజకీయంగా అడ్డుగా ఉంటున్న బలహీనవర్గాలే లక్ష్యంగా అధికారాన్ని, అధికారులను అడ్డు పెట్టుకుని కూటమి ప్రభుత్వం దాడులు, హత్యాకాండను ప్రోత్సహిస్తోందని కురుబ సంఘం యువజన విభాగం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోటి సురేష్ ఆరోపించారు. ఆదివారం బత్తలపల్లిలోని తన స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ హయాంలో ఎలాంటి హత్యలు లేకుండా ప్రశాంత వాతావరణం నెలకొందన్నారు. రాప్తాడు నియోజకవర్గం రామగిరి మండలం పాపిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన కురుబ లింగమయ్య రాజకీయంగా ఎదుగుతుంటే ఓర్వలేనితనంతో టీడీపీ నాయకులు ఆయనను హత్య చేశారన్నారు. ఈ హత్య టీడీపీ ఆరాచకానికి పరాకాష్టగా నిలిచిందన్నారు. ఎమ్మెల్యే పరిటాల సునీత బంధువులు, అనుచరులే కురుబ లింగమయ్యను హత్య చేశారని ఆరోపించారు. జిల్లాలో కురుబ సామాజిక వర్గానికి చెందిన మంత్రి, ఎంపీలు ఉన్నా... ఈ దుర్ఘటనపై నోరు మెదపకపోవడం విచారకరమన్నారు. లింగమయ్య హత్యలో పాత్ర ఉన్న ప్రతి ఒక్కరినీ అరెస్ట్ చేసి, కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కురుబ లింగమయ్య కుటుంబంతో పాటు పార్టీ కార్యకర్తలకు అండగా నిలిచిన వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కురుబ సంఘం తరుపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ నెల 8న వైఎస్ జగన్ పర్యటనను విజయం చేయాలని పిలుపునిచ్చారు. అందరూ ధర్మవరం మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ఇంటి వద్దకు ఉదయం 9 గంటలకు చేరుకుంటే అక్కడ నుంచి ర్యాలీగా మాజీ సీఎం వైఎస్ జగన్ వెంట పాపిరెడ్డిపల్లికి వెళ్లవచ్చునన్నారు.

చేతిలోని మొబైల్ లాక్కెళ్లిన దొంగ



బాధితుడు జాఫర్

రాప్తాడు రూరల్: చేతిలో మొబైల్ పట్టుకుని చూస్తుండగా ఓ యువకుడు లాక్కొని ఉడాయించిన ఘటన ఆదివారం సాయంత్రం అనంతపురంలో చోటు చేసుకుంది. వివరాలు... అనంతపురం రూరల్ మండలం కొడిమి పంచాయతీ దర్గాకొట్టాలుకు చెందిన జాఫర్ పెయింటింగ్ పనులతో జీవనం సాగిస్తున్నాడు. వ్యక్తిగత పనిపై ఆదివారం నగరానికి వచ్చిన ఆయన సాయంత్రం బళ్లారి రోడ్డు కూడలిలో ఆటో కోసం వేచి ఉన్నాడు. అదే సమయంలో ఫోన్ రింగ్ కావడంతో జేబులో నుంచి తీసి చూస్తుండగా రెప్పపాటులో ఓ యువకుడు లాక్కొని కళ్యాణదుర్గం రోడ్డు వైపుగా పరుగుతీశాడు. జాఫర్ తేరుకుని గట్టిగా కేకలు వేసినా లాభం లేకపోయింది. చీకట్లు ముసురుకుంటుండడంతో సెకన్లలోనే ఆ యువకుడు కనిపించకుండా పోయాడు. ఇటీవలే రూ. 20 వేలు పెట్టి మొబైల్ కొనుగోలు చేశానని, ఇంతలో ఇలా జరిగిదంటూ బాధితుడు లబోదిబోమంటూ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఆలూరు కోనలో బ్రహ్మోత్సవాలు ప్రారంభం

తాడిపత్రి: మండలంలోని ఆలూరు కోనలో వెలసిన రంగనాథస్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు భూనీల సమేత శేష తల్ప రంగనాథస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. విష్వక్సేనారాధన, వాసుదేవ పుణ్యాహవాచనము, అంకురార్పణ, ధ్వజారోహణము, కలశస్థాపన, దీక్షా హోమంతో ఉత్సవాలను ప్రారంభించారు. పూజా కార్యక్రమాల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం సింహవాహనంపై స్వామి వారు దర్శనమివ్వనున్నారు. ఈ నెల 12న శనివారం కల్యాణోత్సవంతో బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి.

వాహనం ఢీకొని నక్క మృతి



రొళ్ల: మండలంలోని టీడీ పల్లి క్రాస్ సమీపంలో 544ఈ జాతీయ రహదారి మలుపు వద్ద ఆదివారం ఓ గుర్తు తెలియని వాహనం ఢీకొని నక్క మృతి చెందింది. అటవీ ప్రాంతంలో తాగు నీరు, సరైన ఆహారం లభ్యం కాక కొడగార్లగుట్ట గ్రామం వైపుగా వెళుతూ జాతీయ రహదారిని దాటుతున్న క్రమంలో వాహనం ఢీకొని కుడి వైపున ఉన్న రెండు కాళ్లూ విరిగాయి. తీవ్ర గాయాలతో కొట్టుమిట్టాడుతున్న నక్కకు గ్రామస్తులు ఉపశమన చర్యలు చేపట్టారు. రోడ్డు మధ్యలో నుంచి పాకుకుంటూ పక్కనే ఉన్న రాళ్ల మధ్యలోకి దూరింది. సమాచారం అందుకున్న వైల్డ్‌లైఫ్ వాచర్ భీమప్ప అక్కడకు చేరుకుని, గాయపడిన నక్కను ఆస్పత్రికి తరలించేలోపు మరణించింది. అనంతరం టోల్‌ప్లాజా సమీపంలో ఉన్న అటవీ శాఖ నర్సరీలో నక్క కళేబరాన్ని ఖననం చేశారు.

8న హార్టికల్చర్ రాష్ట్ర సదస్సు

కూడేరు: జిల్లా కేంద్రం అనంతపురంలో ఈ నెల 8న రైతు సంఘం ఆధ్వర్యంలో హార్టికల్చర్ రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నట్లు సీపీఐ అనుబంధ రైతు సంఘం నాయకులు తెలిపారు. ఆదివారం కూడేరులో రాష్ట్ర సదస్సు కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా, మండల నేతలు రమణ, మలరాయుడు, ప్రసాద్, వెంకటేష్ పాల్గొన్నారు.

నేడు సూరేపల్లిలో జ్యోతుల మహోత్సవం

పుట్లూరు: మండలంలోని సూరేపల్లిలో సోమవారం చౌడేశ్వరీదేవి అమ్మవారి జ్యోతుల మహోత్సవం నిర్వహించనున్నట్లు గ్రామ పెద్దలు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా చౌడేశ్వరీ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు గంగ పూజ, చెక్క భజన ఉంటుందన్నారు. అనంతరం సోమవారం రాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకూ జ్యోతుల ఊరేగింపు చేపడతామన్నారు.

ఆకట్టుకున్న బాలరాముడి చిత్రం

రామగిరి: శ్రీరామనవమి సందర్భంగా అరకు కాఫీ పౌడర్‌తో చిత్రీకరించిన బాలరాముడి చిత్రం ఆకట్టుకుంది. ఆదివారం పేరూరు డ్యాంలోని మహాత్మా జ్యోతిబా పూలే (ఏపీఆర్ఎస్) బాలుర పాఠశాలకు చెందిన ఆర్ట్ టీచర్ శ్రీరాములు ఈ చిత్రాన్ని గీశారు. అరకు కాఫీ పౌడర్‌తో సుందరమైన చిత్రాలనూ గీయవచ్చని శ్రీరాములు తెలిపారు.



కాఫీ పౌడర్‌తో చిత్రీకరించిన బాలరాముడి చిత్రం

ఉత్సాహంగా.. ఉల్లాసంగా



151 కిలోల బరువున్న ఇసుక మూట ఎత్తుతున్న యువకుడు



146 కిలోల బరువైన గుండును ఎత్తుతున్న దృశ్యం

గార్లదిన్నె: శ్రీరామనవమి సందర్భంగా గార్లదిన్నె మండలం కల్లూరులో నిర్వహించిన గ్రామీణ క్రీడాపోటీలు ఉత్సాహంగా... ఉల్లాసంగా సాగాయి. అగ్రహారం ఆంజనేయస్వామి దేవాలయం వద్ద ఆదివారం ఈ పోటీలను నిర్వహించారు. పోటీలను చూసేందుకు పెద్ద సంఖ్యలో జనం తరలివచ్చారు. 151 కిలోల ఇసుక మూట ఎత్తే పోటీల్లో పాల్తూరు రాజు మొదటి స్థానాన్ని దక్కించుకున్నాడు. రెండో స్థానంలో కల్లూరు సుధాకర్ నిలిచాడు. 146 కిలోల బరువున్న గుండును ఎత్తే పోటీల్లో మాధవరం రాజశేఖర్ మొదటి స్థానం, ప్యాపిలి మండలానికి చెందిన ఈశ్వరరెడ్డి రెండో స్థానాన్ని దక్కించుకున్నారు. 60 కిలోల బరువున బండను ఒక్క చేతితో పైకి ఎత్తే పోటీల్లో మొదటి స్థానాన్ని హుస్సేన్ దక్కించుకోగా, రెండో స్థానంలో ఈశ్వరరెడ్డి నిలిచాడు. కర్ర సాము పోటీల్లో మొదటి స్థానంలో రాజేష్, రెండో స్థానంలో యాడికి నాగార్జున గెలుపొందారు.ఇరుసు పోటీల్లో మొదటి స్థానంలో నాగులాపురం వనేంద్ర, రెండవ స్థానంలో వంకరాజుకాలువ నరేష్ నిలిచారు. విజేతలను గ్రామస్తులు అభినందించి, నగదు పురస్కారాలతో సత్కరించారు.



ఇరుసు ఎత్తు పోటీల్లో పాల్గొన్న యువకుడు



కర్ర సాముతో ఆకట్టుకున్న యువకుడు